సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



ఘనంగా అష్టోత్తర అర్చనలు


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామివారి అష్టోత్తర పూజలు ఘనంగా చేశారు. ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.



విఘ్నేశ్వరునికి కళన్యాస పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో సోమవారం కళన్యాస పూజలు జరిపారు. స్వామికి పంచామృతాభిషేకం, లక్ష గరిక పూజలు చేశారు.

సముద్రంలోకి మిగులు జలాలు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 3,40,543 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఇక్కడ 8.60 అడుగులకు నీటిమట్టం చేరింది. సాగు అవసరాలకు తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

22న జాబ్ మేళా

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిడదవోలు ఎస్వీఆర్‌కే ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. వివిధ ఉద్యోగాల్లో పనిచేయడానికి ఎంకాం, ఎంబీఏ, డిగ్రీ, ఫార్మసీ, ఇంటర్, పదో తరగతి పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని వివరించారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 96760 52454, 73967 40041 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నలుగురి అరెస్ట్

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెంలో మత్తుమందు ఆల్ప్రోజోలం తయారీ కేసులో నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్టు నల్లజర్ల సీఐ శ్రీనివాస్ తెలిపారు. అరెస్టయిన వారిలో స్థల యజమాని తాతిన బాలకృష్ణ, పుల్లలపాడుకు చెందిన పాతూరి సతీష్, హైదరాబాద్‌కు చెందిన డ్రగ్స్ తయారీ నిపుణులు సాంబన జగదీష్, మాకం వెంకటేష్‌లను అరెస్ట్ చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఆయన తెలిపారు.

వరద బాధితులకు చేయూత



విజయవాడ వెళుతున్న ఆహార పొట్లాల వ్యాన్ వద్ద నున్న సరోజనీదేవి

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలో వరద బాధితులు నాలుగు వేల మందికి సోమవారం బిర్యానీ ప్యాకెట్లు, పెరుగు అన్నం, వాటర్ ప్యాకెట్లు పంపించినట్లు తిరుమల విద్యా సంస్థల డైరెక్టర్ నున్న సరోజనీదేవి తెలిపారు. బుడమేరు వాగు పొంగి విజయవాడ మునిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సలహా మేరకు ఆహార ప్యాకెట్లు పంపుతున్నామన్నారు. ఇలాంటి సమయాల్లోనే ప్రజలంతా ఎంతో అప్రమత్తంగా ఉండాలని, అందరూ ఒకరికి ఒకరు సహాయం చేసుకోవాలని కోరారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ఆకలితో ఉండకూడదని 'తిరుమల చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఈ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఇదేవిధంగా మంగళవారం 10 వేల మందికి ఆహార పొట్లాలను సిద్ధం చేస్తున్నామన్నారు. తిరుమల విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు, మేడపాటి షర్మిలారెడ్డి



కాపవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సంక్షేమ సంతకం వైఎస్సార్

- జిల్లాలో మహానేత వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులు అర్పించిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- వివిధ సేవలు చేపట్టిన ప్రజాప్రతినిధులు

సాక్షి, రాజమహేంద్రవరం: సంక్షేమ సంతకం చేసి.. దార్శనికుడిగా పేరుగాంచి.. ఆరోగ్య ప్రదాతగా నిలిచి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆ మహనీయుడిని వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు కొనియాడారు. మహానేత వర్ధంతి సందర్భంగా సోమవారం తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేసిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. ఎన్నో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. అందుకే ఆయన్ని ఎప్పటికీ ప్రజలు మరిచిపోరని అన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేస్తామని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నగరంలో పలుచోట్ల వివిధ కార్యక్రమాలు నిర్వహించి, సేవలు చేపట్టారు.



గోపాలపురంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తిలక్ రోడ్డు పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. కష్టకాలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసేవారే నిజమైన కార్యకర్తలని వక్తలు అన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి, వైఎస్సార్‌కు అంజలి ఘటించారు.

రాజమహేంద్రవరం రూరల్: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సేవలను కొనియాడారు. పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు.

రాజానగరం: తెలుగు రాష్ట్రాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అని పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరం జంక్షన్‌లో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రాజానగరం వైఎస్సార్ జంక్షన్ వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానేత బాటలో అంతా నడవాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు జరిగాయి.

కొవ్వూరు: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో కొవ్వూరు మెరకవీధి మెయిన్ రోడ్డులోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ చిరస్మరణీయుడని, ఆయన రాష్ట్ర అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని అనపర్తి, బిక్కవోలు, గొల్లల మామిడాడ, రంగంపేట మండలం ఈలకొలను గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. దివంగత వైఎస్సార్ చేసిన సేవలను కొనియాడారు.

నిడదవోలు: నిడదవోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు భోజనాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ నిడదవోలు అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన వైనాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఈ ప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివన్నారు.

గోపాలపురం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. గోపాలపురం వైఎస్సార్ జంక్షన్ వద్ద ఉన్న మహానేత విగ్రహానికి మాజీ హోం మంత్రి తానేటి వనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. యాదవోలులో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

నాణ్యమైన విద్యుత్తు పరికరాలు వాడాలి

ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ తిలక్‌కుమార్



వినియోగదారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ

రాజమహేంద్రవరం రూరల్: ఇళ్లలో వినియోగించే విద్యుత్ పరికరాలు ఐఎస్ఐ మార్కు కలిగి ఉండేలా చూసుకోవాలని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.తిలక్‌కుమార్ అన్నారు. సోమవారం ఏపీ ఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం సర్కిల్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో తేదీన నిర్వహించే విద్యుత్ భద్రతా దినోత్సవం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వినియోగదారులతో ప్రతిజ్ఞ చేయించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఈ తిలక్‌కుమార్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయదారులు, రైతు కూలీలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లో విద్యుత్ జాగ్రత్తలు, గృహ వినియోగదారులు పాటించాల్సిన నియమాలను వివరించారు. విద్యుత్ వినియోగదారులు ఇంట్లో స్విచ్ బోర్డులను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పిల్లలకు అందకుండా తగినంత ఎత్తులో అమర్చుకోవాలన్నారు. ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్ వైర్లు/టెంపరరీగా అనేక పరికరాలకు కలపకూడదని తెలిపారు. ముఖ్యంగా వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు ముట్టుకోరాదన్నారు. విద్యుత్‌కి సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలన్నారు. ఇతర ప్రైవేట్ వ్యక్తులను సంప్రదించరాదని, ఇల్లు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు దగ్గరలో విద్యుత్ లైన్లు, స్తంభాలు ఉంటే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేసి విద్యుత్ సంస్థ ప్రామాణిక నిబంధనల ప్రకారం తగిన దూరం పాటించి నిర్మాణాలను చేపట్టాలని తెలిపారు. మనం ప్రయాణించే వాహనాలపై ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు జారిపడినా, వాటికి మనం ప్రయాణించే వాహనం తగిలినా వాహనంలో నుంచి బయట పడేందుకు గెంతడం, దుమకడం వంటి విధానం అనుసరించాలని ఎస్ఈ వివరించారు. ముందుగా ఆయన విద్యుత్ భద్రతకు సంబంధించి వినియోగదారులు, సిబ్బంది, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈఈలు గాబ్రియేలు, మాల్యాద్రి, ఏఈలు, జూనియర్ ఇంజినీర్లు, విద్యుత్ కార్మికులు, వినియోగదారులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జాతీయ రహదారిపై భ్రమరాంబిక టిఫిన్ సెంటర్ వద్ద 50–60 సంవత్సరాల వయస్సున్న వ్యక్తిని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ప్రత్తిపాడు సీహెచ్‌సీకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.

భార్యను స్వదేశానికి తీసుకురావాలంటూ వేడుకోలు



తన ఇద్దరు పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చిన పావని భర్త దుర్గాప్రసాద్

అమలాపురం రూరల్: బెహ్రాయిన్‌లో తన భార్య ఇబ్బందులు పడుతోందని, స్వదేశానికి తీసుకురావాలంటూ ఓ వ్యక్తి కలెక్టర్‌ను వేడుకున్నాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నడిపూడికి చెందిన దుక్కిపాటి పావని ఓ ఏజెంట్ ద్వారా గత నెల 25న బెహ్రాయిన్‌లోని ఓ ఇంట్లో పని నిమిత్తం వెళ్లింది. అక్కడ అనేక అవస్థలు పడుతున్నట్లు ఆమె ఫోన్‌లో ఆడియో రికార్డింగ్ ద్వారా కుటుంబ సభ్యులకు సందేశం పంపింది. అక్కడికి వెళ్లినప్పటి నుంచి తిండి, నీరు లేక అలమటిస్తున్నానని ఆమె పేర్కొంది. తన ఆరోగ్యం క్షీణించిందని తనను ప్రభుత్వం తిరిగి స్వదేశానికి తీసుకురావాలని పావని వేడుకుంది. ఈ మేరకు భార్య ఆడియో రికార్డింగ్‌తో భర్త దుర్గాప్రసాద్, ఇద్దరు పిల్లలతో వచ్చి సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ మహేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తన భార్యను ఎలాగైనా తిరిగి ఇంటికి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు.

సినీ ఫక్కీలో కిడ్నాప్

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ వ్యక్తి సినీ ఫక్కీలో కిడ్నాప్‌కు గురయ్యాడు. పోలీసులు అతన్ని సురక్షితంగా తీసుకొచ్చారు. ఆ వివరాలు ఇలా.. కాకినాడ రమణయ్యపేటకు చెందిన పుట్టా వీరభద్రరావు, గరికట్ల సాయిప్రసాద్ అనే వ్యక్తులకు గత కొద్ది కాలంగా సివిల్ వివాదాలు ఉన్నాయి. అందుకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తుండగా ఇరువురూ కాకినాడలోని ఫోర్త్ ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరయ్యారు. వాదనలు పూర్తయ్యి బయటకు వస్తుండగా సాయిప్రసాద్, అతడి డ్రైవర్ కలిపి వీరభద్రరావును బలవంతంగా తమ కారు ఎక్కించి తాళ్లతో కట్టి దాడి చేశారు. గాయపడిన వీరభద్రరావును సాయిప్రసాద్ స్వగ్రామం అరట్లకట్టకు తరలించి అక్కడ ఓ గదిలో బంధించాడు. అయితే కోర్టు ఆవరణలో వ్యక్తిని బలవంతంగా కారు ఎక్కించడాన్ని చూసిన ఓ వ్యక్తి డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. తక్షణమే అప్రమత్తమైన కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో గాలింపు మొదలుపెట్టారు. కారు నంబరు గుర్తించి, బాధితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అరట్లకట్టలోని బంధించిన ఇంటికి చేరుకున్నారు. వీరభద్రరావును క్షేమంగా విడిపించారు. అతడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కిడ్నాప్‌కు పాల్పడిన సాయిప్రసాద్, అతడి డ్రైవర్ కూడా పరారీలో ఉన్నారు.

సత్యదేవా నమో నమః

ఘనంగా స్వామివారి జన్మ నక్షత్ర పూజలు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా సోమవారం అన్నవరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు, మూలవిరాట్‌కు అభిషేకాలు, ఆయుష్య హోమం నిర్వహించారు. ఆలయాన్ని తెల్లవారు జామున రెండు గంటలకు తెరిచి ఈ క్రతువులు జరిపారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం దేవతామూర్తులకు ముత్యాల కవచాల (ముత్తంగి సేవ) అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ ఆయుష్య మండపంలో స్వామివారికి హోమం చేశారు. హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించి ఆయుష్య హోమం పూర్ణాహుతి సమర్పించారు. ఈ ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు సుధీర్, పరిచారకుడు శివ తదితరులు పాల్గొన్నారు.



సత్యదేవుని ఆయుష్య హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ రోహిత్ తదితరులు

హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరంలోని సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 32 రోజులకు గాను రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఇందులో నగదు రూ.1,58,68,781 కాగా, చిల్లర నాణేలు రూ.5,49,820 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. వీటితో పాటు బంగారం 44 గ్రాములు, వెండి 880 గ్రాములు, విదేశీ డాలర్లు కూడా ఉన్నాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాలుపంచుకున్నారు.

వివాహాల సందడితో ఆదాయం

గత నెల ఆరో తేదీ నుంచి ఈ నెల రెండో తేదీ వరకూ శ్రావణ మాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని ఆలయానికి తరలివచ్చారు. దీంతో దేవస్థానానికి దండిగా ఆదాయం సమకూరింది. సుమారు మూడు నెలల విరామం అనంతరం శ్రావణ మాసంలో వివాహాలు ప్రారంభం కావడంతో నవ దంపతులు, వారి బంధువులు పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. వీరంతా స్వామివారి వ్రతాలు ఆచరించి దర్శనం చేసుకున్నారు. హుండీలలో పెద్ద సంఖ్యలో కానుకలు సమర్పించారు.



సత్యదేవుని హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నాణ్యమైన పరిష్కారం చూపండి



పాల ప్యాకెట్ల వ్యాన్‌ను విజయవాడకు పంపుతున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలకు నిర్ణీత వ్యవధిలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వచ్చిన అర్జీలను కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు కృష్ణనాయక్, జిల్లా సహకార సంఘాల అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకర్‌రావు, కలెక్టరేట్ ఏఓ పి.పాపారావు తదితరులు అర్జీలను స్వీకరించారు. మొత్తం 144 అర్జీలు వచ్చాయి.

విజయవాడకు ఆహార ప్యాకెట్లు

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల్లో భాగంగా జిల్లా నుంచి ఆహారం, వాటర్ ప్యాకెట్లు, పాలు, బ్రెడ్, అగ్గిపెట్టెలు పంపుతున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులిహోర, పాల వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటికే విజయవాడకు 20 వేల పాల, 2 లక్షల వాటర్, 10 వేల పులిహోర ప్యాకెట్లు, 20 వేల అగ్గిపెట్టెలు, 20 వేల కొవ్వొత్తులు, 75 వేల బిస్కెట్, 50 వేల బ్రెడ్ ప్యాకెట్లు పంపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన స్వచ్ఛంద సంస్థలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ నరసింహకిషోర్

పోలీస్ స్పందనకు 23 అర్జీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్పీ డి.నరసింహకిషోర్ నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకుని, నేరుగా సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ (ఎస్బీ) అనసూరి శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, సబ్ ఇన్‌స్పెక్టర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.